# ఉలిపికట్టె

హఠాత్తుగా శంకరం పోయాడు.

మాధురి గుండె ఆగిపోలేదు.

మతిస్థిరం తప్పలేదు.

కనీసం గొంతెత్తి ఏడవనైనా లేదు.

కూతురుని పట్టుకుని శాంతమ్మ గొల్లుమని ఏడ్చింది. ఇరువైపుల బంధువులూ విచారపడి పోయారు. 'ఇంతచిన్నవయసుకే ఇంతకష్టమా' అన్నారు. కాని చిత్రం...మాధురి ఏడవలేదు.

చుట్టాలు ఎవరిని అనునయిస్తారు?

తల్లి ఎవరికి ధైర్యం చెబుతుంది?

అంత సానుభూతీ ఎవరికి చెందేటట్లు?

శవం సాగిపోతుంటే రెండే రెండు కన్నీటి బొట్లు మాధురి చెక్కిళ్లమీద జారాయి.


అందరూ భయపడుతూనే వున్నారు... మాధురి ఏదో అఘాయిత్యం చేస్తుందని, వున్నట్లుండి ఏదో విపరీతం జరుగుతుందని...కానీ మాధురి ఏ అఘాయిత్యమూ చెయ్యలేదు... ఆ ఇంట్లో ఏ విపరీతమూ జరుగలేదు.

పదకొండురోజులు ముగిశాయి. మాధురికి విధవముద్రపడింది. తనతల్లి గుండె చెఱువయ్యేలాఏడ్చింది. మాధురిమాత్రం అతి మౌనంగా తతంగాలన్నీ ముగించుకుంది.

విడ్డూరం అనుకున్నారు అందరూ అవును మరి భర్తపోతే స్త్రీకి జీవితంలో ఏం మిగులుతుంది? మాధురికి పెళ్ళయి రెండేళ్ళయినా పూర్తికాలేదు. ఇంతలో ఈ అన్యాయం జరిగిపోయింది. ఇంతకూ మాధురి ఏడవలేదెందుకని? ఏమో కాలం మరీపాడయిపోతోంది. అయినా ఇదేం ఆడది తల్లీ? దానిది హృదయమా, శిలాఫలకమా? అది మనిషా, రాక్షసా?

ఈ అభిప్రాయాలు మాధురి వినిపించుకోలేదు కాని ఊహించుకుంది.

కన్నతల్లికి కూడా కూతురితత్వము బోధపడలేదు. ఆ చీకటిరాత్రి మాధురికూడా తనను



రేఖా అండ్ మురళీ ప్రొడక్షన్స్ వారి 'శ్రీరామకథ'లో శ్రీరామ పట్టాభిషేకం దృశ్యం.

తాను ప్రశ్నించుకొంటూ జ్ఞాపకాల పుటలు తిరగవేసింది,

\+ + +

వివాహం ఒక వ్యవస్థ. దానికి తాను కట్టు పడింది. ప్రేమించి భంగపడిందీ లేదు, తియ్యటి జీవితం ఊహించుకనూ లేదు. జీవితం యధాతథంగా తీసుకుంది తాను.

కాని...,ఆయన.... కేవలం యంత్రమని కొన్ని రోజుల్లోనే తెలిసిపోయింది. ఏపనిలోనూ అతనికి అనుభూతివున్నట్లు కనిపించలేదు. తన అవసరం కనిపించిన క్షణాల్లో 'ఏయ్ ఇటురా' అని ఆజ్ఞాపించేవాడు. మాటాపలుకూ లేకుండా తనకోర్కెలు తీర్చుకునేవాడు. ఆ క్షణాల్లో బాగామదించి బుసలుకొట్టున్న ఎద్దుగుర్తుకొచ్చేది మాధురికి.

లోకానికి తను గొప్పఉద్యోగస్థుని భార్య. సంస్కారంగల వ్యక్తి తనభర్త కాని. కాని వీధిలోకి వస్తేవెయ్యి అనుమానాలతో తనను చూస్తుంటాడు. తనమాట, పలుకు, చూపులు

రచన:
శ్రీమతి జె. భాగ్యలక్ష్మి

అన్నీ విమర్శిస్తాడు. నవ్వితే...'ఏమిటా వెకిలి నవ్వు?' ఊరుకుంటే...'ఎప్పుడూ ఏడుపు మొహమే.' అలంకరించుకుంటే...' ఏమిటా షోకులు?' సాదాగావుంటే 'ఏం నీమొగుడు నీ అవసరాలు తీర్చటంలేదా?'

తను సాధ్యమయినంతవరకు ఓర్చుకుంది. తనమౌనంకూడా ఆయనను రెచ్చగొట్టేది.

ఒకసాయంకాలం వచ్చీరాగానే—


'ఎవడికోసం ఎదురుచూస్తున్నావు?'అన్నాడు కఠినంగా.

తెల్లబోయింది.

'ఆ దొంగచూపులూ, నవ్వూ—సమాధానం చెప్పవేం.'

'వీధిలో ఏదో అమ్మకానివస్తే—'

'చాల్లే—' అన్నీ భోగంవేషాలు'



పద్మశ్రీవారి

'వింత కాపురం'లో

శ్రీకృష్ణ-కాంచన.

తనగుండెను పిండినట్లయింది' ఛీ—ఏం మనిషివీరు?' తనదవడలు వాచిపోయాయి. తలను గోడకేసి బాదాడు.' నన్ను ఛీకొట్టే స్థాయికి చేరుకున్నావన్నమాట'

'ఇంత పశువనుకోలేదు' అంది ఉద్రేకాన్ని అదుపులో పెట్టలేని తను.

ఫలితంగా రెండురోజులు అడుగుతీసి పెట్ట లేకపోయింది. అప్పుడే అతనిని హృదయపూర్వకంగా అసహ్యించుకొంది సాటిమనిషిని ఏకారణంలేకుండా బానిసలా చూసుకునేవాళ్లను చిత్రహింసపెట్టి ఆనందము పొందేవాళ్లను భరించటమెంత కష్టమో, తనకు తెలిసి వచ్చింది.

ఒక మధ్యాహ్నం నిద్రబోతున్న తనజుట్టు గుంజినట్లయి ఉలికిపడి లేచింది.

'ఎవడు వీడు?'

తనకు అర్థం కాలేదు.

అతనిచేతిలో కాలేజి కల్చరల్ అసోసియేషన్ ఫోటో—

'ఏమిటలాచూస్తావు? ఒయ్యారంగా వాడి మీద ఒరిగికూర్చున్నావు. ఎవడు వీడు?'

'నాప్రియుడు—ఆ మాత్రం తెలీదూ కాలేజిలో చదివిన తర్వాత ఫోటోలు, మీటింగులు వుంటాయని.'

'తెలుసు. తర్వాత మొగుడితో కాపరం చెయ్యాలని తెలీ .' పిడికిలి బిగించి పొట్టలో గుద్దాడు—

తనస్నేహితురాలనేది నవ్వుతూ 'భార్యలనుకొట్టటమనే పశుత్వమేనాడో పోయింది. భర్తలను కొట్టేకాలంకూడా దగ్గరలోనేవుంది.' అని.

ఏంమూరాడుమగవాడు? అనుక్షణంద్వేషం, అసూయ, శతృత్వం. ఇదేమిజీవితం? ఈ ముళ్ళపొదలజీవితమేనా దాంపత్యమనే నందనవనం? తననిచూస్తే అతనిలో రాక్షసత్వం విజృంభిస్తుందెందుకని?

మనిషి ఎంతో అశక్తుడు. ఉన్న కాస్తజీవితాన్ని ఇలాద్వేషాలతో ఎందుకు నరకప్రాయం చేసుకుంటాడు? అతనితో ఈవిషయాలన్నీ చర్చించాలనిపించేంది. కాని కర్కశమైనమాటలు, తీవ్రమైనచూపులు తన ఒళ్ళు జలదరింపజేసేవి.

ఆయన ఇంట్లోవుంటే తనకు ముళ్ళమీద వున్నట్లుండేది. సాయంకాలం దగ్గరపడుతుంటే, ఆయన అడుగులుచప్పుడువింటే తనగుండెలయ తప్పేది. ఎప్పుడూ కొరడాపట్టుకున్నట్లే క్రూరంగాచిత్రించుకునేది అతన్ని, అతనితో ఏకశయ్యమీదపడుకోవటమంటూ జరిగితే తనకు నిద్ర పట్టేదికాదు. ఒకవేళ నిద్రపట్టినా కలతనిద్రే దానిలో పీడకలలు. ఎన్నోసార్లు నిదట్లో కెవ్వున అరచి అతనితో చీవాట్లుతింది.

ఒక అర్థరాత్రి బాగా తాగివచ్చాడు.

'ఇదీ భరించాలా?' అంది కోపంగా.

'నువ్వెవరు నాకు చెప్పటానికి? నేను సంపాదిస్తాను నాయిష్టం. నోరుమూసుకు ఇలురా!

'ఛీ—ఛీ—పాడూ—'

'ఏమిటే నీవాగుడూ—

ఆ ఉక్కుచేతులు తనబ్రతుక్కేసవాలు.

'ఆడదన్నతర్వాత అణిగిమణిగి వుండాలి. సావిత్రి, సుమతి కథలుచదువుకోలేదు. వాళ్ళందరూనీలాగే బరితెగించారా?'

'ఆకట్టుకథలు నాకుచెప్పకండి. ద్వేషంతో, అధికారంతో ఎవరినీ మీవారిగా చేసుకోలేరు. అలా ఎవరైనా మీకు అణిగివున్నా అది పిరికితనమూ, శక్తిహీనతే లోలోన మిమ్మల్నితప్పక ద్వేషిస్తారు.'

గాజుగ్లాసు ఎగిరివచ్చి తన నుదుటిని కొట్టుకుంది.

'చెప్పతోంది పెద్దఉపన్యాసం. కాలేజిచదువులు వెలగబెట్టావుగా.'

ఎడమచేత్తో రక్తంతుడిచేసుకుంటూ బాత్ రూమ్‌కేసి నడిచిందితను.

ప్రతిరోజూ ఒకశాపం—ఇల్లొకనరకం—ఇలా ఎన్నాళ్ళు—ప్రేమానురాగాలువేనాడో మరచిపోయి సహించటం నేర్చుకుంది. అదీ బాగానసన్నగిల్లుతోంది. ఆపెళ్లి ఒక సాంఘిక వ్యవస్థే—తల్లిదండ్రులకోసం. మర్యాదకోసం సహించింది. కానీ ఎన్నాళ్ళు! ఎన్నాళ్ళు! ఒకసారిధైర్యంచేసి అడిగేసింది.

'ఇద్దరూ ఒకర్నొకరు ద్వేషించుకొంటూ బ్రతకపోతేనేం? మీకు నచ్చినవాళ్ళ నెవరినైనాచేసుకోండి. నాకు విముక్తి కలిగించండి. ఉద్యోగం చేసుకుబ్రతగ్గలను.'

'నీకర్మ. నాకర్మ. అనుభవించకతప్పదు. సంఘంలో నేను తలెత్తుక తిరుగొద్దూ! అయినా కాలేజీ ప్రియుడెవరయినా ఉత్తరంవ్రాశాడా?'

అబ్బ! మాటల్లో విషం మిళాయించటమంటే ఇదే కాబోలు,

'ఇదిగో ఈమాట ఎన్నడూ ఎత్తుకు నీవిధంగా కృంగి కృంగి చావవలసిందే. నేను సుఖపడను. నిన్నుసుఖపడనివ్వను. అలా నిలువుగుడ్లేసుకుచూస్తావేం? తిండిపడెయ్.'

త్రాగుడు ఎక్కువయిందని డాక్టరుచెప్పనూ చెప్పాడు. అయినా తనుమాన లేదు. ఆమత్తులో ఒక రాత్రి లారీక్రిందపడ్డాడు.

'ఇన్ని దెబ్బలు తగిలినా నేను చావనే, నేను చస్తే నువ్వుసుఖపడిపోవూ?' చచ్చేముందురోజు అతినీరసంగా అతనన్న మాట లివి.

చచ్చిపోయాడు. తన జీవితంలో తుఫాను వెలిసింది. ఈ తుఫానులో తనపసుపుకుంకుమలు కోల్పోయింది. నిరంతరం ద్వేషిస్తూ, చిత్రవధ చేసినవ్యక్తిని, ఒకటయినా మధురానుభూతిని ఇవ్వనివ్యక్తిని కోల్పోయినందుకు తనువిలపించాలా? ఇద్దరూశత్రువుల్లా జీవించారు. కేవలం ఒక సామాజికవ్యవస్థకు కట్టుబడి యెలా ఆరాధించగలదు? కుక్క మొరిగితేనే రాయివిసిరే తత్వం మనిషిది. తేలుకుట్టుందేమోనని,దాన్ని చూడగానే చంపేసేవాడు మనిషి. అటువంటిది రోజూశారీరకంగా, మానసికంగా బాధించిన వ్యక్తిని ఎవరైనా ఎలాప్రేమిస్తారు? అందరూ గౌతమబుద్ధులు, మహాత్ములూకాదు కదా. అయినా—తను తప్పుదారిలోవుందేమో—ఏమో—భారత సతీత్వానికే తను కళంకమేమో! కాని తననుతాను మభ్యపెట్టుకోలేదు. అతను లేడని తాను ఏడువలేదు. అ సహజం—అన్యాయం. అవినీతి—అధర్మం. ఉమాం గుండెలలోలేని స్పందన మాటలమూలంగా రాదు. తనజీవితాన్ని శాపంగా మార్చిన తన దుర్విధికి ఏడుస్తుంది కాని భర్త మరణానికి కాదు—అవును, భర్త మరణానికి కాదు—అవును, భర్త మరణానికి కాదు—